క్లుప్తంగా

చలివేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్



గుంటూరు వెస్ట్: స్థానిక కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి బుధవారం ప్రారంభించారు. వేసవి దృష్ట్యా ఉద్యోగులు, కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో షేక్ ఖాజవలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు పాల్గొన్నారు.

నేడు అత్యవసర కౌన్సిల్ సమావేశం వాయిదా

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో గురువారం నిర్వహించాల్సిన అత్యవసర కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు కౌన్సిల్ సెక్రటరీ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఇప్పటి వరకు నగర మేయర్‌గా పనిచేసిన కావటి మనోహర్‌నాయుడు తన పదవికి రాజీనామా చేయంతో ఈనెల 20వ తేదీన అత్యవసర కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు గతంలో ప్రకటించారు. ఈ అత్యవసర సమావేశానికి ఉన్న ఇద్దరు డెప్యూటీ మేయర్లల్లో ఎవరినో ఒకరిని ఇన్‌చార్జి మేయర్‌గా నియమించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రభుత్వానికి లేఖ రాశారు. మేయర్ నియామకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంత వరకు ఎటువంటి స్పందన రాకపోవడంతో సమావేశం వాయిదా పడింది.

కుట్టు మిషన్‌ల పంపిణీ



లక్ష్మీపురం: పేద మహిళలు కుట్టు మిషన్ల పంపిణీ అభినందనీయమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. కొరిటెపాడులోని వినాయక్‌నగర్‌లో బుధవారం టైలరింగ్ శిక్షణ కేంద్రం వద్ద దివంగత శకుంతలాదేవి స్మారకంగా ఆమె కుమార్తె మీనా కుట్టు మీషన్లను పలువురికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహృదయంలో దాతలు ఇస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబాన్ని పిల్లల్ని పోషించుకుంటే ఆ దాతలు సంతోషించి మరింత సహాయానికి ముందుకు వస్తారన్నారు. కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ మహిళలకు జీవనోపాధికి ఈ తరహా కుట్టు మిషన్‌లు చాలా ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు కె.వనలక్ష్మి, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ కన్వీనర్ వై.వి.రమణి, శ్రీను, పద్మ, పార్వతి, శ్రీదేవి పాల్గొన్నారు.

డీఎంహెచ్ఓను సన్మానించిన ఏపీ ఎన్జీవో నేతలు



గుంటూరు మెడికల్: గ్రేడ్–3 ఏఎన్ఎంలకు పదోన్నతి కల్పించిన డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మిను ఏపీ ఎన్జీవో నేతలు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి సుకుమార్, నగర అధ్యక్షుడు ఎస్.పి.ఎస్.సూరి, అమరావతి తాలూకా అధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రత్తిపాడు తాలూకా అధ్యక్షుడు సి.హెచ్.అనిల్, ఏఎన్ఎంల సంఘ నాయకులు సత్యవాణి, అరుణలు పాల్గొన్నారు.

గుంటూరు మెడికల్: గుంటూరు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మికి ఉమ్మడి గుంటూరు జిల్లాలో పదోన్నతులు పొందిన ఏఎన్ఎంలు బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ సంఘాల నాయకులు, ఏఎన్ఎంలకు సంబంధించి పాలనాపరమైన సమస్యలు ఉన్నాయని, వాటిని ప్రభుత్వపరంగా పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు.

సర్వేలో లోపాలు నివారించండి

అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిక్ జగన్నాథ్



తెనాలిఅర్బన్: సర్వేలో ఎటువంటి లోపాలు దొర్లకుండా చూడాలని అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిక్ జగనాథ్ పేర్కొన్నారు. 16వ వార్డులో జరుగుతున్న ఎన్‌సీడీ సీడింగ్, హౌస్ హోల్డ్ సర్వేలను బుధవారం ఆయన పరిశీలించారు. సర్వే చేసే విధానాన్ని అడిగి తెసుకుని పలు సూచనలు చేశారు. ప్రభుత్వ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులున్నారు.

కేఎస్ మార్కెట్ దుకాణాల స్వాధీనం లేనట్లేనా!

హైకోర్టు ఆదేశాలున్నా చర్యలు శూన్యం

- గత ఏడాది మే నెల 31వ తేదీతో ముగిసిన లీజు గడువు
- లీజుదారులు కోర్టును ఆశ్రయించడంతో 90 రోజులు గడువు ఇవ్వాలని ఆదేశం
- గడువు తరువాత మళ్లీ కోర్టును ఆశ్రయించిన లీజుదారులు
- 8 వారాల్లో రూల్ ప్రకారం రెన్యూవల్ కాని దుకాణాలు స్వాధీనానికి చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశం
- కాని ఇంత వరకు స్వాధీనం చేసుకోని రెవెన్యూ అధికారులు



కొల్లి శారదా మార్కెట్‌లోని షాపులు(ఫైల్)

నెహ్రూనగర్: గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న డాక్టర్ కొల్లి శారదా హోల్‌సేల్ కూరగాయాల మార్కెట్ స్వాధీనంలో కోర్టు ఆదేశాలున్నప్పటికి వాటి స్వాధీనానికి రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదు. గత సంవత్సరం మే నెలఖారుతో 25 సంవత్సరాల లీజు గడువు పూర్తయినప్పటికి ఇంత వరకు వాటి స్వాధీనం చర్యలు తీసుకోలేదు.

అసలు జరిగింది ఇలా..

1999లో కొల్లి శారదా మార్కెట్‌లో 88 షాపులను నగరపాలక సంస్థ నిర్మించింది. 25 ఏళ్ల లీజు గడువుతో షాపులను కొంత మంది లీజుదారులు దక్కించుకున్నారు. వీటి గడువు గత నెల మే 31వ తేదీతో ముగిసింది. షాపుల స్వాధీనానికి మూడు నెలల ముందు ఇవ్వాల్సిన నోటీసులను 5 రోజుల ముందు ఇచ్చి వారం రోజుల కాల పరిమితితో షాపులను ఖాళీ చేసి నగరపాలక సంస్థకు అప్పగించాలని నోటీసులు జారీ చేశారు. అప్పటి వరకు సైలెంట్‌గా ఉన్న లీజు దారులు సదరు నోటీసులను ఆధారం చేసుకుని హైకోర్టును ఆశ్రయించారు. ఇంత తక్కువ సమయంలో మమ్మల్ని ఖాళీ చేయాలని చెబితే మా పరిస్థితి ఏంటని? మాకు తగిన సమయం కావాలని హైకోర్టును 38 మంది లీజు దారులు ఆశ్రయించారు. కోర్టు వారి విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని జూన్ 13వ తేదీ వరకు ఎటువంటి చర్యలు తీసుకోకూడదని స్టే ఆర్డర్ ఇచ్చింది. తిరిగి వారం రోజుల తరువాత ప్రభుత్వ రూల్స్ ప్రకారం కొంత సమయం ఇచ్చి కొల్లి శారదా మార్కెట్‌లోని షాపులను స్వాధీనం చేసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు ఇస్తూ లీజుదారులు వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి రెవెన్యూ అధికారులు 90 రోజుల షాపులను నగరపాలక సంస్థకు స్వాధీనం చేయాలని నోటీసులు జారీ చేశారు. సదరు నోటీసుల కాలపరిమితి కూడా గత సంవత్సరం సెప్టెంబర్ 9కి పూర్తిపోయింది. ఆ తరువాత నెల రోజులు పాటు సైలెంట్‌గా ఉన్న రెవెన్యూ అధికారులు ఆ తరువాత వారిని తిరిగి షాపులను ఖాళీ చేయాలని ఒత్తిడి తీసుకురావడంతో లీజుదారులు(88 మంది లీజుదారుల్లో సగం మంది ఒకసారి, సగం మంది మరోసారి) తిరిగి మరలా కోర్టును ఆశ్రయించారు. లీజుదారుల పిటిషన్‌ను స్వీకరించిన హైకోర్టు నిబంధనల ప్రకారం.. జీఓలను ఆధారం చేసుకుని లీజుదారుల షాపులను రెన్యూవల్ చేయాల్సి వస్తే రెన్యూవల్ చేయాలని.. లేని పక్షంలో వారి నుంచి షాపులను స్వాధీనం చేసుకోవాలని గత సంవత్సరం నవంబర్ 25(సగం మందికి), డిసెంబర్ 2న(మరో సగం మందికి) ఆదేశించింది. కాని ఇంత వరకు షాపులను స్వాధీనం చేసుకోలేదు.

సమావేశం నిర్వహించాం

> కొల్లి శారదా మార్కెట్ షాపుల స్వాధీనానికి సంబంధించి లీజుదారులతో 15 రోజులు క్రితం ప్రత్యేక సమావేశం నిర్వహించాం. వారు చెప్పిన అంశాలను నోట్ చేసుకున్నాం. ఆ వివరాలను కమిషనర్‌కు పంపాం. కమిషనర్ నిర్ణయం మేరకు తగిన చర్యలు తీసుకుంటాం.
>
> –డి.శ్రీనివాసరావు, డెప్యూటీ కమిషనర్– 1

షాపుల స్వాధీనం చేయకుండా ఉండేందుకు బేరసారాలు...

షాపులు ఖాళీ చేయించకుండా తిరిగి తమకే రెన్యువల్ అయ్యే విధంగా చూడాలని లీజుదారులు స్థానిక ఎమ్మెల్యే, కేంద్రమంత్రి దగ్గరికి వెళ్లినట్లు సమాచారం. దీంతో నాయకుల సిఫార్సులతో షాపుల స్వాధీనంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీన్నే అదునుగా తీసుకున్న రెవెన్యూ అధికారులు షాపులు స్వాధీనం చేసుకోమని... సబ్ లీజుదారులకు కూడా షాపులను రెన్యూవల్ చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని బేరసారాలు నడుపుతుండటంపై రెవెన్యూ అధికారులపై నగరపాలక సంస్థకు ఫిర్యాదు అందింది. ఆ ఫిర్యాదుపై కూడా ఇంత వరకు ఎటువంటి స్పందన లేదు.

కొనసాగుతున్న భగవద్గీతపై ఆధ్యాత్మిక ప్రవచనం



సువీరానందస్వామి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై బుధవారం శ్రీమద్భగవద్గీత త్రయోదశ అధ్యాయంలోని క్షేత్రజ్ఞ విభాగయోగం ప్రవచనం జరిగింది. చిన్మయ మిషన్ బ్రహ్మచారి సువీరానంద స్వామి ప్రవచిస్తూ పరమాత్మ ఆధ్యాత్మిక జ్ఞానంపై నిత్యస్థితుడై ఉండాలని అన్నారు. తొలుత జరుబుల బంగారుబాబు, శివకుమారి దంపతుల సౌజన్యంతో జరగ్గా, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.

వర్మీ కంపోస్ట్ తయారీ కేంద్రాలను పరిశీలించిన డీఎల్‌పీఓ

గుంటూరు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వర్మీ కంపోస్ట్ తయారీ కేంద్రాలను డీఎల్‌పీఓ శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. మండలంలోని చల్లావారిపాలెం, లాలుపురం, గొర్లవారిపాలెం గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లను సందర్శించారు. అక్కడ తయారవుతున్న వర్మీ కంపోస్ట్ ఎరువులను పరిశీలించారు.

ఆర్‌యూబీ తర్వాతే ఆర్వోబీ నిర్మాణాన్ని చేపట్టాలి



మాట్లాడుతున్న కుటుంబరావు

గుంటూరు ఎడ్యుకేషన్: నగరంలోని శంకర్‌విలాస్ ఆర్వోబీ స్థానంలో రోడ్డు అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టిన తరువాతే నూతన ఆర్వోబీ నిర్మాణాన్ని చేపట్టాలని వివిధ ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార వర్గాలు కోరాయి. అరండల్‌పేటలోని ఓ హోటల్ అఖిలపక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ప్రముఖ ఆర్కిటెక్చర్ ఇంజినీర్ కేఎస్సార్ కుటుంబరావు మాట్లాడుతూ నగరవాసుల చిరకాల వాంఛ అయిన శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణానికి గత ఆరు నెలలుగా వివిధ స్థాయిల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ఇతర ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగంతో కలిసి శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్ర విభజన అనంతరం అప్పటి ఆర్ అండ్ బీ మంత్రి అయ్యన్నపాత్రుడు రూ.150 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపడతామని చెప్పారని, అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.98 కోట్లతోనే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి పూనుకోవడం ద్వారా భవిష్యత్ అవసరాలకు సరిపోదని అన్నారు. ఆర్‌యూబీ నిర్మించిన తరువాతే ఆర్వోబీ నిర్మాణ పనులు చేపట్టాలని పెమ్మసాని, అధికారులకు చెప్పారన్నారు. కాగా మొదట్లో చూపించిన డీపీఆర్‌కు ప్రస్తుతం ఆమోదించిన డీపీఆర్‌కు మధ్య వ్యత్యాసముందని, తాజాగా ఆమోదించిన డీపీఆర్ భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడేదిగా లేదన్నారు. ఆర్ అండ్ బీ అధికారుల ఏకపక్ష నిర్ణయాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయని ఆరోపించారు. నందివెలుగు ఫ్లైఓవర్‌లా కాకుండా కాంట్రాక్టర్‌లతో కాలయాపనకు అవకాశం లేని ఒప్పందాలు కుదుర్చుకుని వేగవంతంగా నిర్మాణం జరపాలని కోరారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శంకర్‌విలాస్ ఆర్వోబీ నిర్మాణంతో వ్యాపారులకు నష్టంతోపాటు అరండల్‌పేట, బ్రాడీపేట మధ్య అనుసంధానం దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు. రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ మాట్లాడుతూ కేంద్ర మంత్రి పెమ్మసాని మరొక రూ.40 కోట్ల వరకు కేటాయింపులు చేయించి, హిందూ కళాశాల సెంటర్ నుంచి లాడ్జి సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహం ఐలాండ్ వరకు పొడిగించాలని సూచించారు. బాధితులకు నష్టపరిహారం ముందుగానే చెల్లించడంతో పాటు కాలయాపన లేకుండా భద్రతా చర్యలు చేపట్టి, వేగంగా పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కార్యక్రమంలో ఎల్.భారవి, కె.నళినీకాంత్, మట్టుపల్లి వెంకట సుబ్బారావు, నడింపల్లి గురుదత్, అవగాహన శివరామిరెడ్డి, అవధానుల హరి, మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్, ఆడిటర్ పీవీ మల్లికార్జునరావు, డాక్టర్ కె.చక్రవర్తి పాల్గొన్నారు.

'ప్రకృతి'పై ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వర్లు

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీరణం పెంచే విధంగా ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. ఖరీఫ్ ప్రణాళిక, ప్రకృతి వ్యవసాయం(పీఎండీఎస్) కార్యక్రమంపై మండల స్థాయి సమన్వయ సమావేశం బుధవారం నిర్వహించారు. నగరంలోని కృషి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ ప్రణాళిక పీఎండీఎస్ కార్యక్రమం నిర్వహణకు వ్యవసాయశాఖ, డీఆర్‌డీఏ సిబ్బంది సహాయ సహకారాలు ఎంతో అవసరమని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత, అవసరం, రసాయన వ్యవసాయం వలన కలిగే నష్టాలను వివరించారు. రాష్ట్ర కార్యాలయం ప్రతినిధి గోపిచంద్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఖరీఫ్ ప్రణాళిక, పీఎండీఎస్ ఆవశ్యకత గ్రామ, మండల స్థాయి సిబ్బంది విధులు బాధ్యతలు తెలిపారు. జొన్నలగడ్డ గ్రామానికి చెందని ప్రకృతి వ్యవసాయ రైతు శ్రీనివాసరెడ్డి ప్రకృతి వ్యవసాయంలో తన అనుభవాలను, లాభలను వివరించారు. అధికారులు శ్రీనివాసరెడ్డికి ఉత్తమ రైతుగా సన్మానం చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం అధనపు ప్రాజెక్ట్ మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

అనధికార తాగునీటి తరలింపు నిలిపివేయాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



ఇంజినీరింగ్ అధికారులతో చర్చిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ రిజర్వాయర్ల నుంచి అనధికారికంగా తాగునీటి తరలింపు నిలిపివేయాలని, తమ రోజువారీ పర్యటనల్లో, ఆకస్మికంగా రిజర్వాయర్లను తనిఖీ చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. బీఆర్ స్టేడియం రిజర్వాయర్‌ను బుధవారం తనిఖీ చేశారు. ట్యాంకర్ల ద్వారా నీటి తరలింపును పరిశీలించారు. రిజిస్టర్ ప్రకారం ఆయా ట్యాంకర్లు నీటి సరఫరా చేసినట్లు నమోదు చేసిన ప్రగతినగర్‌కు నేరుగా వెళ్లి స్థానికులను అడిగి తెలుసుకొని, రిజిస్టర్‌లో ట్యాంకర్ల ట్రిప్పుల నమోదు కంటే అధికంగా ట్యాంకర్లు తరలిస్తున్నారని విషయం తెలుసుకున్న కమిషనర్ రిజిస్టర్ నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆప్కాస్ ఉద్యోగిని తక్షణం సదరు విధుల నుంచి తొలగించి ఇతర విభాగంలో విధులు కేటాయించాలని ఎస్ఈని ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగు నీటి సరఫరాపై ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. రిజర్వాయర్ల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటి అనధికార విక్రయాలు చేస్తున్నారని, తమ దృష్టికి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆకస్మికంగా రిజర్వాయర్ల తనిఖీలు చేస్తామన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సి వస్తే ట్యాంకర్ నంబర్, డ్రైవర్ వివరాలు, ట్రిప్పులు, సరఫరా చేసిన ప్రాంతం, ప్రజల సంతకాలు, ఫోన్ నంబర్లను పక్కాగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. కీలకమైన తాగు నీటి సరఫరాలో నిర్లక్ష్యంగా ఉంటే ఇంజినీరింగ్ అధికారులపై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు. బీఆర్ స్టేడియం రిజర్వాయర్‌లో పైప్ లైన్ మరమ్మతులు చేపట్టి నీటి వృథాని అరికట్టాలని కోరారు. సుద్దపల్లి డొంక రోడ్ ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. అనంతరం బాలాజీ నగర్, యానాది కాలనీ, రాజీవ్ గృహకల్ప ప్రాంతాన్ని పరిశీలించి, బాలాజీ నగర్‌లో ఖాళీ స్థల యజమానులకు నోటీసులు ఇవ్వాలని, రాజీవ్ గృహకల్ప, యానాదీ కాలనీల్లో నూతన డ్రెయిన్, రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని ఏఈని ఆదేశించారు. మూడు వంతెనల వద్ద ఆర్డీపీ మేరకు జరిగిన విస్తరణ ప్రభావిత భవనాల తొలగింపు పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న మిగిలినవి కూడా తొలగించాలని, రైల్వే ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకొని, వారి వైపు నుంచి చేపట్టాల్సిన పనులను పూర్తి చేయాలని డీఈఈకి సూచించారు. పర్యటనలో కార్పొరేటర్ చిస్టి, డీఈఈ నాగభూషణం, ఎస్ఎస్ రాంబాబు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు వృత్తి నైపుణ్యంపై శిక్షణ



తెనాలి టౌన్: డ్వాక్రా మహిళలు వృత్తి నైపుణ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని సంగం జాగర్లమూడి గ్రామ సర్పంచ్ పాలడుగు జయనాగలక్ష్మి సూచించారు. బుధవారం మండలంలోని సంగం జాగర్లమూడి గ్రామం ఎలిమెంటరీ పాఠశాలలో జెఎంజె మహిళా కళాశాల గృహ విజ్ఞానశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు వృత్తి నైపుణ్యంపై శిక్షణా తరగతులు నిర్వహించారు.ముఖ్యఅతిధిగా సర్పంచ్ జయనాగలక్ష్మి పాల్గొని శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. దుస్తులపై పెయింటింగ్,రంగుల వినియోగం, తయారీ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ జయనాగలక్ష్మి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు తెనాలి జెఎంజె మహిళా కళాశాల గృహ విజ్ఞానశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో టై అండ్ డై కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులు ఎంతో ఓర్పుతో మహిళలకు శిక్షణ ఇస్తున్నారని అభినందించారు.కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి పాటిబండ్ల సీతారామయ్య

డెప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు



మాట్లాడుతున్న డెప్యూటీ స్పీకర్

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలో విద్యాభివద్ధిని కాంక్షించిన మహోన్నత వ్యక్తి పాటిబండ్ల సీతారామయ్య అని ఉప సభాపతి కె.రఘురామ కృష్ణంరాజు అన్నారు. లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాల వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ తాము ఎదగడంతో పాటు సమాజాన్ని ముందుకు నడిపించడంలో సీతారామయ్య వంటి వ్యక్తులు చేసిన కృషి భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ మాట్లాడుతూ లాభాపేక్షకు తావులేని విధంగా పాఠశాల సమాజంలో విద్యారంగాభివృద్ధికి కృషి చేస్తోందని చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నల్లపనేని శేషగిరిరావు, సామ్రాజ్యం, పాఠశాల కమిటీ అధ్యక్షుడు దేవినేని మల్లికార్జునరావు, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జె.పద్మజ పాల్గొన్నారు.

డ్రోన్ నిఘాతో నేరాల నియంత్రణ



ఆత్మకూరు జాతీయ రహదారిపై డ్రోన్‌లతో ట్రాఫిక్ రద్దీని పరిశీలిస్తున్న పోలీసులు

మంగళగిరి: డ్రోన్ల సహకారంతో అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్, ప్రమాదాల సమస్యలకు చెక్ పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం నగర పరిధిలోని జాతీయ రహదారిపై డ్రోన్ సహకారంతో ట్రాఫిక్, ప్రమాదాల సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రోన్ల నిఘాతో అసాంఘిక కార్యక్రమాలను సులభతరంగా అరికట్టవచ్చన్నారు. జనం రద్దీగా వుండే జాతీయ రహదారి వెంటనే బస్ స్టేషన్‌లు, కూడళ్ళలో డ్రోన్లతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అసాంఘిక శక్తులను అరికట్టడమే లక్ష్యమన్నారు. అధిక రద్దీ వున్న ప్రాంతాలలో నిరంతరం డ్రోన్లతో నిఘా వుంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సిహెచ్ వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

మాటల మాంత్రికుడు శ్రీరామకృష్ణ

- దర్శకత్వం నుంచి తెలుగు సినిమా స్టార్ రైటర్‌గా ప్రస్థానం
- తెనాలి నుంచి ఎదిగి చెన్నైలో స్థిరపడిన రైటర్
- మొత్తం 365 సినిమాలకు రచనా సహకారం
- రేపు స్వస్థలమైన తెనాలిలో ప్రథమ వర్ధంతి సందర్భంగా....



దర్శకుడిగా విజయశాంతికి సూచనలు చేస్తూ...



ఎస్పీ బాలు, చిత్రలతో



శ్రీరామకృష్ణ

తెనాలి: శ్రీరామకృష్ణ... తెలుగు చలన చిత్ర పరిశ్రమ లో తెనాలి వారసుడు. సహాయ దర్శకుడిగా కెరీర్‌ను ఆరంభించి దర్శకుడిగా ఎదిగి, రచయితగా కొనసాగిన మాటల మాంత్రికుడు. తెలుగు సినిమా హైదరాబాద్‌కు తరలివచ్చినా డబ్బింగ్ రచయితగా అవకాశాల వెల్లువతో చెన్నైలో స్థిరపడ్డారు. అయిదు దశాబ్దాల కెరీర్‌లో 360 పైగా సినిమాలకు సంభాషణలు సమకూర్చారు. శంకర్, మణిరత్నం వంటి ప్రసిద్ధ దర్శకుల సినిమాలకు తన డైలాగులతో సొగసులద్దిన లెజండరీ రైటర్ శ్రీరామకృష్ణ. 74 ఏళ్ల వయసులో అనారోగ్యంతో గతేడాది చెన్నైలో కన్నుమూశారు. ఆయన తొలి వర్ధంతిని ఈనెల 21న స్వస్థలమైన తెనాలి చెంచుపేటలోని రావి టవర్స్‌లో నిర్వహించనున్నారు. శ్రీరామకృష్ణ పరిచయం. శ్రీరామకృష్ణ పూర్తిపేరు ముక్కామల రామకృష్ణ. అదే పేరుతో రెండు తెలుగు సినిమాలకు దర్శకత్వం వహించారు. జాతకం రీత్యా పేరుకు ముందు శ్రీ చేర్చుకుని శ్రీరామకృష్ణగా సినీ పరిశ్రమలో రైటర్‌గా స్థిరపడ్డారు. తల్లిదండ్రులు సీతారావమ్మ, పురుషోత్తం. వీరికి ఇద్దరు కుమార్తెలు. కుమారుడు. మిక్కిలినేని, రామకోటితో కలిసి పురుషోత్తం బుర్రకథలు చెప్పేవారట! కళాకారుడి కొడుకుగా శ్రీరామకృష్ణకు తొలి నుంచీ సినిమాల్లో నటించాలనే ఆసక్తి. తెనాలిలో పీయూసీ చదువుకు మధ్యలోనే డుమ్మా కొట్టాడు. చెన్నై రైలెక్కాడు. డిగ్రీ చదువుతూ సినిమా అవకాశాలకోసం ప్రయత్నించసాగాడు. ఆ క్రమంలో ప్రముఖ దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు దగ్గర సహాయ దర్శకుడిగా చేరారు. రెండు, మూడు సినిమాలు చేశాక ఆయన మరణించటంతో తమిళ దర్శకుడు దురై దగ్గర స్థానం లభించింది. 'వాడిగే వీడు', 'పసి' సినిమాలకు పనిచేశారు. 'చట్టానికి కళ్లు లేవు' సినిమాకు అసోసియేట్ దర్శకుడయ్యా రు. శ్రీరామకృష్ణ ప్రతిభను గమనించిన దురై, 'సమాజంలో స్త్రీ' సినిమాకు దర్శకత్వం అవకాశం కల్పించారు. విజయశాంతి, రావుగోపాలరావు, సుమన్, భానుచందర్ నటించిన ఈ హీరోయిన్ ఓరియంటెడ్ సినిమా ప్రజాదరణ పొందింది. ఇదే సినిమాలో తమిళ నటుడు శరత్‌కుమార్‌కు అవకాశం ఇచ్చిన శ్రీరామకృష్ణ. ఆయనకు తానే స్వయంగా డబ్బింగ్ చెప్పారు. తర్వాత కళ్యాణ చక్రవర్తి హీరోగా 'బాలమురళి ఎంఏ సినిమాకు దర్శకత్వం వహించారు. ఇందులో కేవీ మహదేవన్, ఎస్పీ బాలు, పి.సుశీలతో కలిసి పనిచేశారు. నిర్మాతగా 'ధ్వని' అనే సినిమా తీశారు. ఈ తరుణంలోనే 'సాజన్' అనే హిందీ సినిమాకు మూలరచయిత కోరికపై తెలుగు సంభాషణలు రాయాల్సి వచ్చింది. ఆ డైలాగులు హిట్టవటంతో అవకాశాలు వరుస కట్టాయి. ఇక దర్శకత్వం జోలికి పోయేందుకు సమయం లేనట్టుగా తయారైంది. తమిళం, తెలుగు భాషల్లో మంచి పట్టు ఉండటంతో పాత్ర ల్లోని భావోద్వేగాలను దృష్టిలో వుంచుకుని అద్భుతంగా రాసేవారు. బొంబాయి, జీన్స్, ఒకే ఒక్కడు, అపరిచితుడు, జెంటిల్‌మెన్, చంద్రముఖి, భారతీయుడు, రోబో, రోబో 2.0, రావణ, రంగం, సెవెన్త్ సెన్స్, శివపురం, అరుణాచలం, వీఐపీ, కడలి, విక్రమసింహా, దొంగలకు దొంగ, మనోహరుడు, ఉత్తమ విలన్ వంటి సూపర్‌హిట్ సినిమాలకు రచనా సహకారం అందించారు. వీటిలోని డైలాగులు డబ్బింగ్ అనిపించవు. సహజంగా ఉండేలా రాశారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ సినిమాలు ముత్తు నుండి దర్బార్ వరకు డైలాగులను శ్రీరామకృష్ణ రాశారు. ప్రసిద్ధ దర్శకులు శంకర్, మణిరత్నం సినిమాల్లో 'మాటలు: శ్రీరామకృష్ణ' అనే ఉంటుంది. శ్రీరామకృష్ణ మాటలు రాశారంటే ఆ సినిమా హిట్టన్న భావన పరిశ్రమలో ఉండేది. మొత్తం 365 సినిమాలకు సంభాషణలు రాశారు. 'సఖి', సతీలీలావతి' సినిమాల్లో మాటలతోపాటు, పాటలూ రాశారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో అవకాశాలను తగ్గించుకున్నారు. రజనీకాంత్ 'దర్బార్' సినిమానే ఆయన చివరి సినిమా. 'సంతోషం' తొలి అవార్డును ఆయనే అందుకున్నారు. తెలుగు మూవీ డబ్బింగ్ ఆర్టిస్ట్స్ యూనియన్‌చే 'ఆరుద్ర లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు'తో సహా పలు అవార్డులను స్వీకరించారు. ఎంతగా ఎదిగినా ఒదిగా వుండటం ఆయన నైజం. ప్రచారానికి దూరంగా ఉండేవారు. విశ్రాంత జీవితం అనుభవిస్తూ 2024లో అనారోగ్యానికి గురయ్యారు. చెన్నైలోని కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అదే ఏడాది ఏప్రిల్ ఒకటిన కన్నుమూశారు. ఆయన భార్య స్వాతి. భర్త మృతితో ఆమె స్వస్థలమైన తెనాలికి వచ్చేశారు.